# యద్భావం తద్భవతి

కోలపల్లి ఈశ్వర్

"జీవితాశయంగా భావించి, ఎంతో కష్టపడి చదివి అమెరికా చేరుకుని ఉద్యోగంలో చేరి రెండు నెలలయినా కాకముందే నన్ను ఇండియా వచ్చేయమనడం ఎంతవరకు సబబో మీరే ఆలోచించుకోండి డాడీ"

"ఆలోచించే పరిస్థితి కాదు కదరా ఇది నాకు. నాకయితే బుర్ర పనిచేయట్లేదు. మీ మమ్మీ బెడ్ మీద నీ కోసమే కలవరిస్తోంది" రామచంద్రరావు గొంతులో బాధ, దుఃఖం, ఆత్రుత, చిరుకోపం... లాంటి రకరకాల భావాలు మిళితమై ఉన్నాయ్.

ఆ విషయం అనూప్‌కి అర్థమవుతూనే ఉంది. కానీ కన్నతండ్రి బాధ, దుఃఖాలకు కరిగిపోయి తనిప్పుడు సెంటిమెంటల్‌గా ఫీలయితే తన కెరీర్ పూర్తిగా నాశనమైపోతుంది. కాబట్టి తను ఏమాత్రం తొణకకుండా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. అందుకే కాస్త కఠినంగా మాట్లాడక తప్పదు అనుకున్నాడు అనూప్. ఏం చేస్తాడు మరి...

"నేను ఇండియా వొచ్చేస్తే జరగాల్సింది జరగకుండా ఆగిపోతుందా డాడీ. మీరే చెపుతున్నారు మమ్మీ మరో ఇరవై నాలుగు గంటలకు మించి బ్రతకదని డాక్టర్లు తేల్చి చెప్పేశారని. అలాంటప్పుడు నేను అక్కడకి వచ్చి చేసేదేముంది? నేను వచ్చేవరకు మమ్మీ ఆగుతుందా? లేచి కూర్చుంటుందా?"

రామచంద్రరావుకి కొద్ది క్షణాలపాటు నోట మాట రాలేదు. కన్నతల్లి చావుని ఆహ్వానిస్తూ చివరి క్షణాలలో కన్నకొడుకుని చూడాలని కలవరిస్తుంటే ఆ పేగు తెంచుకుని పుట్టిన కొడుకు 'నేను అక్కడకి వస్తే చావు ఆగుతుందా?' అని అది చాలా సర్వసాధారణ విషయంగా మాట్లాడుతుంటే ఏ కన్నతండ్రికి గొంతు పెగిలి మాట వస్తుంది?

అది ఇంటర్నేషనల్ ఫోన్ కాల్. అయినా తనలా రిసీవర్ చేత పట్టుకుని శిల్పంలా నిలబడిపోయానన్న విషయమూ ఆయన మర్చిపోయాడు.

"డాడీ...డాడీ...హలో...హలో...డాడీ.." అవతలి వైపు నుండి అరిచినట్టు పిలుపు వినబడటంతో ఆయన ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చాడు.

"ఆ..." అని అనగలిగాడు ఎలాగో.

"మాట్లాడరేంటి ఉండనా...అయితే"

"అదేరా.. అదే.. ఏం మాట్లాడాలో అర్థం కాక" తనను తాను కంట్రోల్ చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు.

"ఇలా ఫోన్ పట్టుకుని ఆలోచించుకుంటూ ఉంటే వేలల్లో టెలిఫోన్ బిల్లు చెల్లించాల్సి వస్తుంది. నువ్ తిన్నట్టా నేను తిన్నట్టా. ఇక మాట్లాడేదేమీ లేదు గానీ ఏదయినా జరిగితే మాత్రం నాకు ఫోన్ చేయండి. అలర్ట్‌గా ఉండండి. ప్రతీదానికీ బెంబేలెత్తిపోతే ఎలా. డబ్బు పంపిస్తున్నాను డ్రా చేసుకోండి"

"ఏదన్నా జరిగితే మాత్రం నీకు తెలియజేయడం ఎందుకురా ఫోన్ బిల్లు దండగ కదా" నోటి చివర వరకూ వచ్చిన మాటల్ని అతికష్టం మీద అనకుండా ఉండగలిగాడాయన.

"ఉంటానూ" ఫోన్ పెట్టేశాడు రామచంద్రరావు.

ఆయనకి నిస్సత్తువగా ఉంది. కళ్లు తిరుగుతున్నట్టనిపించి కుర్చీలో అలాగే కూర్చుండిపోయాడు.

మనసు కకావికలంగా ఉంది. ఏం జరగబోతున్నదో అర్థం కాని అయోమయంలో పడిపోయాడు.

చాలాసేపటి తర్వాత చప్పున తేరుకుని 'తనిప్పుడు హాస్పిటల్‌కి వెళ్లాలి. ఐ.సి.యు.లో ఉన్న సుమతి తన కోసం ఎదురుచూస్తూ ఉండకపోవచ్చు. తను అక్కడికెళ్లి చేయగలిగిందేమీ లేకపోవచ్చు. కానీ...కానీ..మనిషి అన్నాక మనసు కొట్టుకులాడటం సహజం! మానవ సంబంధాలు అవసరం ఉందా- లేదా అన్నది ఆలోచించనివ్వవు. ఆపద సమయంలో దగ్గరగా ఉండటం, ఉండాలని కోరుకోవడం మామూలు విషయం..కానీ...

ఆయనకు మళ్లీ అనూప్ గుర్తుకొచ్చాడు. అసలు గుర్తుకు రానిదెప్పుడు? ప్రతి క్షణం రామచంద్రరావు మనసులో తన కొడుకు మెదులుతూనే ఉన్నాడు.

'తల్లి చావు ఘడియలు లెక్కపెడుతుంటే రాలేని పరిస్థితుల్లో ఉన్నాడా? మనిషి దేనికి బానిస?'

సుమతి... అప్పుడప్పుడు స్పృహలోకొస్తోంది. వచ్చిన తక్షణమే 'అనూప్ వచ్చాడా?' అన్నట్టు ఆశగా తన కళ్లల్లోకి ప్రశ్నార్థకంగా చూస్తుంది. ఇప్పుడు హాస్పిటల్‌కెళ్తే ఆమె చూపులకు తనేం జవాబు చెప్పాలి?

రామచంద్రరావు ఇంటికి తాళం వేసి హాస్పిటల్‌కి బయల్దేరాడు. సుమతికి ఏదో ఒకటి చెప్పాలి.

స్కూటర్‌ని పార్కింగ్ ప్లేస్‌లో ఉంచి, హాస్పిటల్ లోపలికి నడుస్తుంటే మనసంతా అదో రకమైన బాధతో నిండిపోయింది.

ఆ జబ్బులకు ఏవేవో పేర్లు చెపుతారు. అవేం జబ్బులో! సుమతికి ఒంట్లో రక్తం విపరీతంగా తయారవుతోందట. రోజుకి రెండు మూడు బాటిల్స్ రక్తం తీసి బయట పారబోసేస్తున్నారు. గత వారం రోజులుగా ఇలా జరుగుతోంది. డాక్టర్లు ఇక లాభం లేదని తేల్చేసి, లైఫ్ టైమ్ మరికొద్ది గంటలేనని నిర్ణయించేశారు.

రామచంద్రరావు ఐ.సి.యు.లోకెళ్లాడు. ముప్పై ఏళ్ల పాటు తన జీవితంలోని కష్టసుఖాలను పంచుకున్న సహధర్మచారిణి. ప్రస్తుత పరిస్థితిని నిశ్శబ్దంగా చూశాడు. అక్కడి నుండి వచ్చేసి కారిడార్‌లో కూర్చుండిపోయాడు.

○○○

సుమతి ఇక పోరాడలేక మర్నాడు భవబంధాలను వదిలించుకుని శాశ్వత నిద్రలోకి వెళ్లిపోయింది.

ఆమె మరణాన్ని అనూప్‌కి తెలియజేశాడు రామచంద్రరావు.

ఆ విషయం తెలిసినా అనూప్ అదే మాట చెప్పాడు. "నేను వచ్చి చేయగలిగేదేముంది డాడీ? జరగవలసిన కార్యక్రమాలు మీరే నిర్వహించండి"

ఆయన చాలా ప్రశాంతంగా "అలాగే లేరా" అన్నాడు.

దహనసంస్కారాలు తనే పూర్తి చేశాడు.

ఆ సమయంలో వచ్చిన బంధుమిత్రులు "మీ అబ్బాయి స్టేట్స్‌లో కదూ ఉండేది. విమానం దొరకలేదేమో" అని ఆరాగా అడుగుతుంటే

"లేదండీ.. వాడు ఈమధ్యనే కదా అమెరికా వెళ్లింది. వాళ్ల కంపెనీ రూల్స్ ప్రకారం ఇప్పట్లో పంపరట" అని జవాబు చెప్పాడు.


మనసుని రాయి చేసుకుని బాధని ఏమాత్రం బయట పడనివ్వకుండా జరగాల్సిన కార్యక్రమాలు జరిపించసాగాడు.

'కన్నతల్లి మరణం కూడా కొడుకుని కదిలించలేకపోయింది. కేవలం.. కేవలం.. మళ్లీ అమెరికా వెళ్లే అవకాశం రాదన్న ఆలోచనతోనే కన్న బిడ్డ తల్లిని ఆఖరుసారిగా కూడా చూడలేకపోయాడు. అంటే తల్లి మరణం కన్నా కెరీర్ ముఖ్యమనేనా అనూప్ ఉద్దేశ్యం?'

దశదిన కర్మలతో సహా అన్నీ పూర్తయిపోయాయ్.

○○○

ఒంటరితనాన్ని మించిన బాధ మరొకటి లేదు.



నిరంతరం ఆలోచనలు చుట్టుముట్టి మనిషిని ఆ ఒంటరితనంలో పిచ్చివాడయ్యేలా చేస్తాయ్.

ఆలోచనలు రేపే ప్రభావం అంతా ఇంతా కాదు.

తన నుండి సుమతి ఇంత త్వరగా దూరమవుతుందని తను కలలో కూడా ఊహించలేదు. ఊహించని పరిణామంతో తనిప్పుడు ఒంటరివాడయ్యాడు.

రామచంద్రరావుకి భార్య గురించి బాధ ఒక చెంత ఉంటే, మరోవైపు అనూప్ గురించి వ్యాకులత పెరగసాగింది.

ఆయనకిప్పుడు కొడుకు మీద అసహనంతో కూడిన కోపం వస్తోంది. దిగులు కలుగుతోంది. అంతకు మించి ఒక్కోసారి నిరాసక్తత కూడా ఏర్పడుతోంది.

'కన్నతల్లి మరణిస్తేనే ముఖం చూపించనివాడు రేపు తండ్రి మరణానికి హాజరవుతాడని నమ్మకం ఏముంది?'

ఆ ఊహకు చలించిపోయాడు రామచంద్రరావు. అతని నవనాడులూ కృంగిపోయాయ్! సుమతిని కడతేర్చటానికయినా తను ఉన్నాడు. శాస్త్ర ప్రకారం జరిపించాడు.

'రేపు తను పోతే... అనూప్ రాడా? రాడు.. మరి తను అనాథ శవంలాగా కార్పొరేషన్ వాళ్లు ఈడ్చి పారేస్తారా? కుక్కలతో కలిపి పూడ్చిపెడతారా?'



రామచంద్రరావు ఒళ్లు జలదరించింది.

ఎటు పోతోంది ఈనాటి యువత? భవితేనా ధ్యాస? అదే ఆయనకు అర్థంకావటం లేదు. పిచ్చెక్కుతోంది.

రామచంద్రరావు దిగులు, ఆలోచనలతో కృంగి, కృశించి పోతుంటే ఓ రోజు ఆయన బాల్య మిత్రుడు మల్లికార్జున వచ్చాడు. మిత్రుడిని చూసి కాస్త ఉత్సాహాన్ని కొని తెచ్చుకుని "హైదరాబాద్ నుండి ఎప్పుడొచ్చావ్‌రా?" అన్నాడు రామచంద్రరావు.

"ఉదయమే వచ్చాను. రాగానే సుమతి విషయం తెలిసింది. వెంటనే ఇలా వస్తున్నాను"

మల్లికార్జున పుట్టింది, పెరిగింది నెల్లూరులోనే అయినా రియల్ ఎస్టేట్ వ్యాపారం హైదరాబాద్‌లో స్టార్ట్ చేసి అక్కడే సెటిలైపోయాడు. నెలకో, రెండు నెలలకో ఇటు వచ్చి అన్నదమ్ముల్ని కలుసుకుని వెళుతుంటాడు. వచ్చినప్పుడు తప్పకుండా రామచంద్రరావుని కలవందే వెళ్లడు. వాళ్ల స్నేహం అలాంటిది.

అవీ ఇవీ అడిగాక మల్లికార్జున ప్రశ్నించాడు. "అనూప్ అమెరికాకి మళ్లీ వెళ్లిపోయాడా?" అంటూ లోపలికి తొంగి చూశాడు.



"మళ్లీ అమెరికా వెళ్లడం ఏమిటి?"

"అదే...వాళ్ల మమ్మీ కోసం వచ్చి మళ్లీ వెళ్లిపోయాడా అని" వివరించాడు మల్లికార్జున.

"వాడసలు ఇండియాకొస్తే కదా మళ్లీ వెళ్లడానికి?" నిరాసక్తంగా అన్నాడు రామచంద్రరావు.

అతనిలోని మారుమూల దాగి ఉన్న బాధ ఇప్పుడు మల్లికార్జున రాకతో ఆత్మీయమైన పలకరింపుతో ఎగదన్నుకుని బయటకొచ్చింది.

మల్లికార్జున నమ్మలేనట్టు రామచంద్రరావు ముఖంలోకి చూశాడు.

"నిజమా...ఏవిట్రా నువ్వనేది రాలేదా?"

"అవున్రా రాలేదు. తనిప్పుడు తిరిగి వచ్చేస్తే మళ్లీ అమెరికా వెళ్లే అవకాశం రాదని ఇండియాకి రాలేదు"

మల్లికార్జున తన చేతిని రామచంద్రరావు వీపు మీద వేసి ఆప్యాయంగా నిమిరాడు. గాఢంగా నిశ్వసించాడు.

రామచంద్రరావుని ఓదార్చటానికి అన్నట్టుగా "ఇప్పట్లో ఈ తరం కుర్రాళ్లంతా ఇలాగే చేస్తున్నార్రా"

రామచంద్రరావుకి బాధని కంట్రోల్ చేసుకోవటం కష్టమైపోయింది. పొర్లిపొర్లి వచ్చేస్తోంది దుఃఖం. కుర్చీమీదున్న టవల్ని అందుకుని కళ్లు గట్టిగా తుడుచుకున్నాడు. మిత్రుడి వంక చూసి ఇలా అన్నాడు.

"ఈ తరం కుర్రాళ్ల సంగతి ఏమో గానీ అనూప్ ఇలా చేయటం నాకు నాకు చాలా బాధనిపించింది. మానవ సంబంధాల మీదే నమ్మకం పోయింది. తల్లి ఎవరు? బిడ్డ ఎవరు? వీళ్ల మధ్య తెగని ముడి ఉందా? అసలీ లోకంలో ఎవరికెవరు? ఈ జ్ఞానం లేకుండానే మనం మన బిడ్డ, మన రక్తం మన పాశం అని పాకులాడుతుంటాం"

మల్లికార్జున చాలా స్థిరంగా చెప్పాడు. "అవును. నీలోకి తొంగి చూసుకో. గతం గుర్తుకు తెచ్చుకో..నువ్వు చేసిన తప్పును. నిన్ను తెలుసుకోమంటున్నాను"

"నేను.. నేను చేసిన తప్పేంటి?"

"నువ్వా, నేనా అన్నది పక్కన పెడదాం. మనలాంటి నేటి తరం తల్లిదండ్రులలో చాలామంది చేసే తప్పే మనమూ చేశాం. నేనూ అలాంటి తప్పే చేశాను. నిన్ననటం ఎందుకు?"

"నువ్వా... నువ్వేం తప్పు చేశావ్?"

మల్లికార్జున ఏం మాట్లాడుతున్నాడో అర్థంకాక అయోమయంగా చూడసాగాడు రామచంద్రరావు.

"అవును... నేనే. నా తప్పేంటో చెప్పనా... రేయ్ రామచంద్రం తల్లిదండ్రులెవరయినా తమ బిడ్డలకు మంచి భవిష్యత్తు ఉండాలనే కోరుకుంటారు. అది ధర్మం. తమ బాధ్యత కూడా! పిల్లల భవిత కోసం తామూ ఏదో రూపంలో ఎంతో కొంత త్యాగం చేస్తూ అలాగే పిల్లలనూ కొన్ని రకాల త్యాగాలకు అలవాటు చేస్తారు. వారి నుండి అద్భుతమైన బాల్యాన్ని దోచేసుకుని, చదువే లోకంగా గడిపేలా చేస్తారు. కొన్ని కొన్ని విలువైన అనుబంధాలను వాళ్లకు అందనివ్వకుండా చేసేసి ఈ ప్రపంచంలో అన్నిటికన్నా ముఖ్యమైనది, విలువైనది 'కెరీర్' అన్న భ్రమను వాళ్లకు కలిగేలా చేసేస్తున్నారు. అంతెందుకు అనూప్ వాళ్ల నాన్నమ్మ చనిపోయినప్పుడు వాడు ట్రైనింగ్కి ఢిల్లీకి వెళ్లి ఉన్నాడు. నువ్వు ఇలా జరిగిందని ఫోన్ చేస్తే వాడు వస్తానన్నప్పుడు నువ్వేమన్నావో గుర్తుందా? నువ్వొచ్చి మాత్రం చేసేదేముంది? అంతా అయిపోయింది. టైం వేస్ట్ తప్ప! ట్రైనింగ్ జాగ్రత్తగా పూర్తిచెయ్, మంచి భవిష్యత్తుకు నీకీ కోచింగ్ నాంది అని అన్నావు గదరా.

నా అనుభవంలో 'వాట్ డాడీ? మీరూ సెంటిమెంటల్గా మాట్లాడుతున్నారు. నేను అక్కడికి వచ్చి చేయగలిగిందేమయినా ఉందేమో లాజికల్గా ఆలోచించండి. లైఫ్లో ఇలాంటివన్నీ రొటీన్. మనం కాస్త ప్రాక్టికల్గా ఫాలో అవ్వాలి. మీ మీసాల మామయ్య అంటే మా తాతయ్య చనిపోయినప్పుడు... హాయిగా చదువుకో ఫస్ట్ ర్యాంక్ రావాలి అదే నీకు ఇంపార్టెంట్ అంటూ నేనా ఊరు వస్తానంటే మీరు చెప్పిన మాటలు నేనెన్నడూ మర్చిపోలేను నాన్నా ఆ మాటల్ని మనసులో నుండి చెరిపేసుకోలేకపోతున్నాను కాబట్టే ఇప్పుడు రాలేకపోతున్నాను. మిమ్మల్ని నోరారా నాన్నా... అని పిలవాలని ఉన్నా భేషజాలు, లేనిపోని కిరీటాలూ తగిలించుకుని పిలవలేకపోతున్నాను. అంత చిన్న కోరిక కూడా తీర్చుకోలేని దౌర్భాగ్యపు జీవితం గడుపుతున్నా డాడీ...."



మల్లికార్జున చెప్పటం ఆపి కళ్లు వత్తుకున్నాడు.

దీర్ఘంగా నిశ్వసించాడు. అతని కళ్లు అతని ప్రమేయం లేకుండానే ధారాపాతంగా వర్షిస్తున్నాయ్.

"వాళ్ల మనసుల్లో ఒక రకమైన ఆలోచనాబీజాలు నాటి, మరో రకమైన ఆలోచనా ఫలాలు కోరితే అవి ఎలా వస్తాయ్ చెప్పు? మన కోరిక అత్యాశ కదూ"

"అవున్రా...నిజమే నువ్వంటున్నది... మనం తప్పుచేసి నింద పిల్లల మీద నెడుతున్నాం"

మల్లికార్జున కాసేపు మౌనంగా ఉండిపోయాడు. అతని మనసు బాధని అనుభవిస్తోంది. పాత గాయం కెలికినట్టయింది.

రామచంద్రరావు పరిస్థితీ అంతే!

## గిట్టుబాటంటే ఇదే!

దీపికా పదుకొనే 'కింగ్ ఫిషర్' యాడ్స్కిగాను *2 కోట్ల రూపాయల డీల్ కుదుర్చుకుందని వచ్చిన వార్త ఇంకా పాతబడక ముందే మరో బాలీవుడ్ భామ ప్రియాంకా చోప్రా కూడా రెండు కోట్ల రూపాయల్ని ఓ యాడ్ కాంపైనింగ్గాను అందుకుంటోంది. 'సన్సిల్క్' షాంపూ కొత్త యాడ్స్లో నటించేందుకు ప్రియాంకకి రెండు కోట్లు ముడుతున్నాయట. నిజంగా సినిమాలకంటే యాడ్సే గిట్టుబాటుగా వున్నట్టుంది కదా!*